

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి కరీంనగర్ జిల్లా

సోమవారం 07 సెప్టెంబర్ 2026 పేజీలు :10

# పట్టణంలో పార్కింగ్ పరేషాన్..

**రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు.. రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాల నిలుపుదల**

**ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, పాదచారుల అవస్థలు -- పట్టించుకోని అధికారులు**



**మెట్ పల్లి డివిజన్, సెప్టెంబర్ 6 (విజన్ ఆంధ్ర)**

పట్టణంలో పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాల్లో సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. మరోవైపు కొందరు వ్యాపారులు తమ దుకాణాల ముందు ఉన్న రహదారి, ఫుట్‌పాత్ ప్రాంతాలను ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దుకాణాల ముందు వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడం, రహదారులపై సరుకులు ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను వ్యాపార అవసరాలకు వినియోగించడం వల్ల రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా కదలాల్సి వస్తుండగా, పాదచారులు సైతం రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

**ప్రమాదాలకు దారితీస్తున్న అస్తవ్యస్త పార్కింగ్ :**

రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు దారి లేకపోవడం, అకస్మాత్తుగా వాహనాలు బయటకు రావడం వంటి పరిస్థితులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ ఎక్కడ?పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా పార్కింగ్ సదుపాయాలపై సరైన ప్రణాళిక లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

**ఆక్రమణలపై చర్యలు ఎప్పుడు?**

రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై అధికారులు క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పార్కింగ్‌పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రధాన రహదారుల్లో నో-పార్కింగ్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణను పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టణ అభివృద్ధి అంటే భవనాలు, దుకాణాలు పెరగడం మాత్రమే కాదు.. ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా రహదారులను కాపాడటమూ అభివృద్ధిలో భాగమే. ఇప్పటికైనా మున్సిపల్, పోలీస్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి మెట్ పల్లి పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

## తండ్రియాల, బొమ్మేనలో జోరుగా ఇసుక దందా!

**ట్రాక్టర్లతో కుప్పలు.. టిప్పర్లతో దూర ప్రాంతాలకు తరలింపు**

**ప్రభుత్వ ఆదాయానికి గండి.. పట్టించుకోని అధికారులు**

**అధికారపార్టీ నాయకులే ఈ దందా!**

**చూసించుడనట్టుగా అధికారుల పని తీరు**

**కథలాపూర్ సెప్టెంబర్ 6(విజన్ ఆంధ్ర ):**

మండలంలోని తండ్రియాల, బొమ్మేన గ్రామాలలో ఇసుక రవాణా జోరుగా సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకచోట నుంచి ట్రాక్టర్ల ద్వారా



మిగతా 2 లో..

## భీమేశ్వరుడి దర్శనానికి జనసంద్రం!

**రద్దీ మధ్య భక్తుల సౌకర్యాలపై డీఈవో ప్రత్యేక దృష్టి**



**వేములవాడ, సెప్టెంబర్ 6 (విజన్ ఆంధ్ర):**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణ మాసం ముగింపు దశకు చేరుకోవడంతో పాటు ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు 52,676 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ తెలిపారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ స్వయంగా ఆలయ ప్రాంగణంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. కోడె మొక్కుల క్యూలైన్లు, ఉచిత ధర్మ దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం మార్గాలతో పాటు అభిషేకం, అన్నపూజ టికెట్ కౌంటర్లను తనిఖీ చేశారు. క్యూలైన్లలోని భక్తులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు.ఆది, సోమ, శుక్రవారాల్లో అధికంగా ఉండే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక డ్యూటీలను సమీక్షించిన డీఈవో, భక్తులు సజావుగా దర్శనం చేసుకునేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రద్దీ నియంత్రణ, భద్రత విషయంలో ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**పూజలు, సేవలకు విశేష స్పందన**

భక్తులు కోడె మొక్కులు 3,420, శీఘ్ర దర్శనాలు 2,461, అతి శీఘ్ర దర్శనాలు 853, మహా రుద్రాభిషేకాలు 116, అన్నపూజలు 68, శివకల్యాణాలు 63, కుంకుమ పూజలు 12, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు 8, చండీ హోమాలు 4 నిర్వహించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు క్రమపద్ధతిలో క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఈ పరిశీలనలో ఆలయ ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస శర్మ, శివసాయి, రాజేందర్, నరేందర్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఆలయ రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రసమయి అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్



**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేయడానికి నిరసిస్తూ ఆదివారం మానకొండూరు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాస్తారోకో వల్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి దీంతో పోలీసులు జోక్యం చేసుకొని వాహనాల రాకపోకలను

# విద్యార్థుల్లో మేధాశక్తి, ఏకాగ్రతకు చదరంగం ఎంతో ముఖ్యం

## జీనియస్ చెస్ అకాడమీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్




**జగిత్యాల డివిజన్ ఇంచార్జి సెప్టెంబర్ 6: (విజన్ ఆంధ్ర )**

విద్యార్థుల్లో మేధాశక్తితో పాటు ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాన్ని పెంపొందించడంలో చదరంగం ఎంతో కీలకమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల పట్టణంలో విద్యార్థులకు చదరంగంలో మెరుగైన శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన జీనియస్ చెస్ అకాడమీని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలను చదరంగం వైపు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. చదరంగంపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు సరైన శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జగిత్యాలలో జీనియస్ చెస్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి నాణ్యమైన శిక్షణ అందిస్తే భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి చెస్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అకాడమీ మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.అకాడమీ డైరెక్టర్, సీనియర్ కోచ్ కంకటి అనూప్‌కుమార్ మాట్లాడుతూ జగిత్యాల ప్రాంతంలోని విద్యార్థుల్లో దాగి ఉన్న చెస్ ప్రతిభను వెలికితీసి, వారికి క్రమబద్ధమైన శిక్షణ అందించడమే అకాడమీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ జెడ్పీ చైర్మన్ వసంత సురేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఏ. జ్యోతి లక్ష్మణ్, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, అకాడమీ నిర్వాహకులు సంగీత, డాక్టర్ నవీన్, వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోఆర్డినేటర్ సుజన్‌కుమార్, సతీష్‌బాబు, కౌన్సిలర్లు, సర్పంచులు, చెస్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర స్వామివారి సన్నిధిలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి



**వేములవాడ సెప్టెంబర్ 06 (విజన్ ఆంధ్ర) :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి శ్రీమతి పి. నీరజ కుటుంబ సమేతంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులలో భాగంగా స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు.పూజల అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు, అర్చకులు ప్రిన్సిపల్ జిల్లా జడ్జికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

# రసమయి వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం



**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం శంకరపట్నం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో బాలకిషన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలచే ఎన్నికైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన రసమయి బాలకిషన్ ఎమ్మెల్యే ను పరుష పదజాలంతో అవమానించేలా మాట్లాడడం సరికాదని, అలా మాట్లాడడం సంస్కారమనిపించుకోదని ఆయన పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలే తప్ప వ్యక్తిగత విమర్శలకు దిగడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనారసమయి తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి గట్టు తిరుపతి, ప్యాక్స్ చైర్మన్లు గోపగోని బసవయ్య గౌడ్, కీసర సంపత్, గాజుల మహేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, పార్టీ నాయకులు ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఊకంటి మధుకర్, గొట్టె మధు, కోరెం రాజిరెడ్డి,చింతిరెడ్డి పద్మ, కవ్వ పద్మ,సదానందం, రాయిని రమేష్, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

# మడక గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో.....

## ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన...

## బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్




**ఓదెల సెప్టెంబర్ 6,(విజన్ ఆంధ్ర)**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలన పూర్తి అయిన 420హామీలు,6 గ్యారంటీలు అమలు చేయాలని పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి అయిన ఇచ్చిన 420 దొంగ హామీలు ఒకటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేయకపోతే పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.నిరసన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది పేద ప్రజలు అనారోగ్య పాలవుతున్నా రన్నారు. డెంగ్యూ,మలేరియా, సెల్యులైటిస్ అనే వ్యాధులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని వెంటనే గ్రామాలలో పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని,గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి పేద ప్రజలనూ ఆదుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు స్వచ్ఛ శుక్రవారం,పల్లె ప్రగతి పట్టణ ప్రగతికి ఎన్నో నిధులు కేటాయించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, నాయకులు నోముల ఇంద్రారెడ్డి, ఆవుల రవీందర్,గోషిక లింగమూర్తి,గోషిక నరేష్,అసరి కుమార్,గిద్దెమారి రమేష్,తుడి సంపత్,సాదరి రమేష్,గడ్డం శ్యాం కుమార్,నవీన్,శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.




# తండ్రియాల, బొమ్మేనలో జోరుగా ఇసుక దందా!

ఇసుకను తరలించి కుప్పలుగా నిల్వ చేసి, అనంతరం టిప్పర్లలో దూర ప్రాంతాలకు తరలిస్తున్నారని వారు పేర్కొంటున్నారు.ఇలా ఇసుకను తరలిస్తున్న వ్యవహారంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అనుమతులు, రవాణా పర్మిట్లు, ప్రభుత్వ రుసుముల చెల్లింపులపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.ట్రాక్టర్లతో ఇసుకను కుప్పలుగా చేసి, టిప్పర్ల ద్వారా పెద్ద మొత్తంలో తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు,సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించకపోవడంతోనే ఇసుక రవాణాదారులు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కాసులోచ్చుకో నీపని నిది నాపని నాది అన్నటుగా ఉందని చర్చించుకుంటున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తండ్రియాల, బొమ్మేన గ్రామాల పరిధిలో ఇసుక రవాణాపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మెట్ పల్లి లో గిరిజనుడి ఇంటిపై

# మున్సిపల్ అధికారుల దౌర్జన్యం..



**మెట్ పల్లి డివిజన్, సెప్టెంబర్ 6 (విజన్ ఆంధ్ర)**

నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకుంటున్న నిరుపేద ఎస్టీ ( లంబాడి ) కుటుంబంపై మెట్ పల్లి మున్సిపల్ అధికారులు, కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగా కక్షగట్టి వేధింపులకు గురిచేస్తున్నారని బాధితుడు దేవి సింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే ఫోర్జరీ సంతకాలు సృష్టించి తన ఇంటి స్లాబ్‌ను, కరెంట్ మీటర్‌ను కూల్చివేశారని ఆరోపించారు.అసలేం జరిగింది..మెట్ పల్లి పట్టణంలోని 9వ వార్డు పరిధిలో దేవి సింగ్ నివాసం కోసం స్థలం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించారు. నిర్మాణం జరుగుతున్న సమయంలో మున్సిపాలిటీ నుంచి నోటీసు రాగా, దానికి వివరణ ఇస్తూ లిఖితపూర్వకంగా సంతకం చేసి అందజేశారు. స్లాబ్ పూర్తి కావచ్చిన తరుణంలో, ఎటువంటి తుది నోటీసు ఇవ్వకుండానే మున్సిపల్ సిబ్బంది అకస్మాత్తుగా వచ్చి స్లాబ్‌ను పగులగొట్టి, కరెంట్ మీటర్ బాక్స్‌ను ధ్వంసం చేశారని బాధితుడు తెలిపారు. తాము నోటీసు ఇచ్చామని అధికారులు చూపించిన పత్రాలపై ఉన్న సంతకం తనది కాదని, మున్సిపల్ సిబ్బందే నకిలీ సంతకం (ఫోర్జరీ) చేసి అక్రమ కూల్చివేతలకు పాల్పడ్డారని ఆధారాలతో సహా బాధితుడు మీడియా ముందు వెల్లడించారు.

### దుండగుల బెదిరింపులు -- అర్ధరాత్రి సపోర్టుల తొలగింపు


ఇంటి నిర్మాణం ప్రారంభం నుంచే కొందరు వ్యక్తులు తనపై, తన భార్యపై బెదిరింపులకు దిగారని బాధితుడు పేర్కొన్నారు. స్లాబ్ వేసిన అనంతరం అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని దుండగులు వచ్చి స్లాబ్ కింద ఉన్న సపోర్టు కర్రలను తొలగించి ప్రాణనష్టం కలిగించేలా కుట్ర పన్నారని, దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని తెలిపారు. దీనిపై ఇప్పటికే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ అరాచకాల వెనుక మున్సిపల్ కమిషనర్ అండదండలు ఉన్నాయా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

### ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు ?

నోటీసు ఇవ్వకుండా కూల్చివేయడం, ఫోర్జరీ సంతకాలు చేయడంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను (భూా) నిలదీసేందుకు వచ్చిన బంధువులు, మిత్రులపై కమిషనర్ అక్రమంగా కేసులు నమోదు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితుడు ఆరోపించారు. పట్టణంలో ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు, వేరే ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ బతుకుతున్న తనలాంటి గిరిజనుడిని లక్ష్యంగా చేసుకుని వేధించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు.

### ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి

ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా ఇల్లు కూల్చివేసి, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను బాధితుడు దేవి సింగ్ డిమాండ్ చేశారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ పరీక్షా శిబిరం విజయవంతం

**80 మందికి ఉచిత మధుమేహ పరీక్షలు**

**-- ఆరోగ్య అవగాహన కల్పించిన డా. శరణ్య**

**రామగిరి సెప్టెంబర్ 6(విజన్ ఆంధ్ర**

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో సోమవారం సెంటినరీ కాలనీ మార్కెట్ రోడ్‌లోని బస్ స్టాండ్ వద్ద నిర్వహించిన ఉచిత మధుమేహ పరీక్షా శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో మొత్తం 80 మందికి ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించారు. మధుమేహం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, మధుమేహాన్ని ముందుగానే గుర్తించడం, ఆహార నియమాలు, రోజువారీ వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం వంటి అంశాలపై లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, డా. శరణ్య మారుతి యాదవ్ ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. శరణ్య మాట్లాడుతూ, మధుమేహం ప్రారంభ దశలో చాలామందికి స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని, అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయులను పరీక్షించుకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి ఉచిత ఆరోగ్య, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు మరియు చైర్మన్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## గన్నేరువరంలో రసమయి దిష్టిబొమ్మ దహనం



**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

మానకొండూర్ ఎమ్మెల్యే పై మాజీ ఎమ్మెల్యే రసమయి అనుచిత వ్యాఖ్యలు చేయడానికి నిరసిస్తూ గన్నేరువరం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రసమయి దిష్టిబొమ్మను దహనం చేశారు. రసమయి డౌన్ డౌన్ ఆయనకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సునిల్, ఎస్సీ సెల్ నేతలు అలవాల కోటి, మాతంగి అనిల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బిచ్చమెత్తిన చరిత్ర రసమయిదే తప్ప కవ్వంపల్లిది కాదని వారు స్పష్టం చేశారు. పెండ ఎత్తుకెళ్లిన చరిత్ర కూడా రసమయికి ఉందని ఆరోపించారు. ఎమ్మెల్యే దంపతుల ఉదాహరణ, ఔదార్యాన్ని ప్రశ్నించేఅర్హత రసమయికి లేదని వారు స్పష్టం చేశారు. ఇకనుంచి ఎమ్మెల్యే పై అసత్యపు ఆరోపణలు చేసినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా ఊర్కో బోమని , ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కటకం తిరుపతి,పార్టీ నాయకులు అనంతరెడ్డి, శ్రీధర్ రెడ్డి, విజేందర్, రాపోలు నవీన్, అనిల్ బొల్లి రవీందర్, ప్రదీప్, పరశురాం, జీవన్, మల్లేష్ గౌడ్,నరేష్ సంపత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డ్యూటీల కేటాయింపుపై ఆరోపణలు ఆర్ఐ సస్పెండ్

### జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నతాధికారుల చర్యలు

**జగిత్యాల,డివిజన్ ఇంచార్జి సెప్టెంబర్ 6: (విజన్ ఆంధ్ర )**



జగిత్యాల జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అడ్మిన్ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. సిబ్బందికి డ్యూటీల కేటాయింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఆయనపై వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే కొంతమంది సిబ్బందికి విధులు కేటాయించకుండా డబ్బులు వసూలు చేశారనే ఫిర్యాదులు కూడా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టిన అనంతరం కిరణ్‌కుమార్‌పై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆయనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు, విచారణలో తేలిన అంశాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. సస్పెన్షన్‌కు దారితీసిన కారణాలు, విచారణలో వెలుగుచూసిన అంశాలపై పోలీస్ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## బెజ్జంకిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ”



**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

కేసీఆర్ రాజీనామా చేయాలని, బూతు పురాణాల రసమయి బాలకిషన్ భాష మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండానే బీఆర్ఎస్ శాసన పక్ష నేత కేసీఆర్ 23 కోట్ల రూపాయల వేతనం,అలవెన్సులు తీసుకొని తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఫామ్ హౌస్ హౌసుకే పరిమితం అవుతున్న కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పై రసమయి బాలకిషన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను లింగాల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. సత్యనారాయణ అధికారం కోల్పోవడంతో పిచ్చిపట్టి బూతుల మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే రసమయి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి పిఏసిఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి,మాజీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, డైరెక్టర్ లు బైర సంతోష్, కుక్కల రాములు, శంకర్,రామచంద్రం,నర్సింగరావు,ఒంటెల సంపత్ రెడ్డి,రావుల నర్సయ్య,జెల్ల ప్రభాకర్,పర్శ సంతోష్,కర్రవుల సందీప్,కుంట హరికృష్ణతోపాటు వివిధ గ్రామాల పార్టీ సర్పంచ్ లు అన్ని గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దిశానిర్దేశం

## కాంగ్రెస్ ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేయాలి



**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

టీపీసీసీ ఎస్సీ సెల్‌ను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేసి, దళితుల సమస్యల పరిష్కారానికి చురుకైన వేదికగా తీర్చిదిద్దాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎస్సీ సెల్ జాతీయ నాయకులు కొప్పుల రాజు, జాతీయ కోఆర్డినేటర్ సిద్దార్థ్ హితంబ్రే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ సెల్ కార్యకలాపాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, దళితుల సమస్యలపై పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎస్సీ సెల్‌ను క్రియాశీలం చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. దళితుల హక్కులు, రాజ్యాంగ విలువలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని దిశానిర్దేశం చేశారు. .కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేయాలి

## రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దిశానిర్దేశం



**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

టీపీసీసీ ఎస్సీ సెల్‌ను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేసి, దళితుల సమస్యల పరిష్కారానికి చురుకైన వేదికగా తీర్చిదిద్దాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎస్సీ సెల్ జాతీయ నాయకులు కొప్పుల రాజు, జాతీయ కోఆర్డినేటర్ సిద్దార్థ్ హితంబ్రే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ సెల్ కార్యకలాపాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, దళితుల సమస్యలపై పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎస్సీ సెల్‌ను క్రియాశీలం చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. దళితుల హక్కులు, రాజ్యాంగ విలువలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని దిశానిర్దేశం చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# రసమయి బొమ్మతో శవ యాత్ర



## దిష్టిబొమ్మ దహనం

**మానకొండూర్ సెప్టెంబర్ 6 విజన్ ఆంధ్ర**

మానకొండూర్ ఎమ్మెల్యే పై మాజీ ఎమ్మెల్యే రసమయ బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేయడానికి నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండల కేంద్రంలో రసమయి బొమ్మతో శవయాత్రను నిర్వహించారు. అనంతరం రాజీవ్ రహదారిపై రసమయి దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ మాట్లాడుతూ మానకొండూరు ఎమ్మెల్యేపై రసమయి చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమన్నారు. వంకర బుద్ధిగల రసమయి ప్రతిదాన్ని వంకరగానే ఆలోచిస్తూ వక్రీకరణలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ పేదలకు వైద్య సహాయం అందించాలని ఉదాత్తమైన ఆలోచనతో వైద్య శిబిరం నిర్వహిస్తే ఆ శిబిరం పై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా రసమయి తన నీచ బుద్ధిని చాటుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఉపాధ్యాయ కొలువు వెలగబెట్టిన రసమయికి ఆయన తల్లిదండ్రులు నేర్పించిన సంస్కారం ఇదేనా అని రమేష్ సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా రసమయి తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో చెప్పులు, చీపుర్లతో బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దావు సంపత్ రెడ్డి, నుస్తులాపూర్, పోరండ్ల ప్యాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, బుదారపు శ్రీనివాస్, కొండలరావు, కొత్త తిరుపతిరెడ్డి, గొట్టముక్కల సంపత్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, బిళ్ల సంతోష్, అనోద శ్రీనివాస్, పోలు రాము, రమేష్, ఎలక రాజు, రెడ్డిగాని రాజు, రాములు యాదవ్, పోతుగంటి శ్రీనివాస్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణే లక్ష్యం.. సమాజ సేవే సంకల్పం

**వేములవాడ సెప్టెంబర్ 06 (విజన్ ఆంధ్ర):**

వేములవాడ పట్టణంలోని గాయత్రి మాత ఆలయంలో విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ, గత 63 సంవత్సరాలుగా విశ్వహిందూ పరిషత్ హిందూ ధర్మ పరిరక్షణ, గోరక్షణ, మతమార్పిడుల నివారణ, ధార్మిక చైతన్యం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో ముందుకు సాగుతోందన్నారు. మతమార్పిడులకు గురైన పలువురిని తిరిగి స్వధర్మంలోకి తీసుకురావడంలో, లవ్ జిహాద్‌కు గురైన యువతులకు అండగా నిలవడంలో, అలాగే అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణ ఉద్యమంలో విశ్వహిందూ పరిషత్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ సమాజంలో ఐక్యత, ధార్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ కార్యదర్శి గుండోజీ గోపాల్, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, నాగుల రాములు గౌడ్, చేకూర్తి నవీన్, దండి గణేష్, కమలాకర్, రాజేష్, శివ, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.





# నూతన వాహన పూజా షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

**మల్యాల, సెప్టెంబర్ 06 (విజన్ ఆంధ్ర):**

కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న భారీ వాహన పూజా షెడ్డు పనులకు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా వై-జంక్షన్ వద్ద 60 ఐ 100 అడుగుల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ షెడ్డును 30 నుంచి 40 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. పగటి వేళ వాహన పూజలకు, రాత్రి వేళ సుమారు 1,000 మంది భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఆలయ అభివృద్ధి కోసం 180 ఎకరాల అటవీ భూమి బదిలీ, మాస్టర్ ప్లాన్ ఫైళ్లను త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. టీటీడీ నిధులు రూ. 35.19 కోట్లతో చేపట్టే పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. నవంబర్ 15 నుంచి 20 వరకు శ్రీ స్వామివారి చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని, ఈ ఉత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 హామీలు.. బీఆర్ఎస్ పోరుబాట!!

## ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు ఏవీ?

## ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం ఏది?

## రేవంత్‌కు దమ్ముంటే బిల్లు పెట్టాలి

## ప్రభుత్వాన్ని నిలదీసిన హరీష్‌రెడ్డి



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 6 (విజన్ ఆంధ్ర):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఆటో డ్రైవర్ల జీవితాల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ఆటో కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ధర్మపురి మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి కూడా పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని విస్మరించిందని ఆరోపించారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తామని చెప్పినా అమలు చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతో ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గి వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడ్డాయని పేర్కొన్నారు. ఆటో కార్పొరేషన్, ఆటో భవన్, ఇన్సూరెన్స్, సంక్షేమ నిధి ఏర్పాటు వంటి హామీలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈశ్వర్ విమర్శించారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన డ్రైవర్లు ఆదాయం లేక ఈఎమ్ఐలు చెల్లించలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాల్ల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. "రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఈ నెల 7న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆటో కార్మికుల సంక్షేమ బిల్లును ప్రవేశపెట్టాలి" అని డిమాండ్ చేశారు. రామగుండం ప్రాంతంలో ఆటో డ్రైవర్లు ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ట్రాఫిక్ చలాన్ల పేరుతో మరింత ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయడంతో పాటు సంక్షేమ బిల్లును తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కౌశిక్ హరి, మేకల సమ్మయ్య, ఆటో కార్మిక సేవా సమితి అధ్యక్షుడు కడార్ల శ్రీధర్‌తో పాటు భారీ సంఖ్యలో ఆటో కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా గుట్ట పోచమ్మ బోనాలు!!

## భక్తి భావంతో పోటెత్తిన భక్తజనం

## డప్పుచప్పులతో మార్మోగిన రైల్వేస్టేషన్ ప్రాంతం

## నృత్యాలతో భక్తుల సందడి

## చైర్మన్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో జాతర



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 6 (విజన్ ఆంధ్ర):**
రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలోని గుట్టపై కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి సహిత శ్రీశ్రీశ్రీ బంగారు పోచమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ కన్నులపండుగగా జరిగింది. శ్రావణమాసంలో ప్రతి ఏటా నిర్వహించే ఈ జాతర ఈసారి సెప్టెంబర్ 6న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధ్యాత్మిక సందడిని నింపింది. కుటుంబ సమేతంగా



తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో అడుగుపెట్టిన ప్రతి భక్తుడి ముఖంలో కనిపించిన ప్రశాంతత, మనసులో నిండిన భక్తిభావం జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుట్టపై కొలువైన తల్లిని దర్శించుకుని తమ కుటుంబాలను చల్లగా చూడాలని, సుఖసంతోషాలతో ఉంచాలని భక్తులు వేడుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో తమ జీవితాల్లో మంచి జరగాలని కోరుకుంటూ ఎంతో నమ్మకంతో బోనాలను సమర్పించారు. శివాజీనగర్, భారత్‌నగర్, ఎస్టీ కాలనీ, ఆదర్శనగర్, రైల్వే కాలనీ, అక్బర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డప్పుల దరువులు, భక్తుల నృత్యాలతో రైల్వేస్టేషన్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని అమ్మవారి సన్నిధికి చేరుకోవడం చూపరులను ఆకట్టుకుంది. తరతరాలుగా కొనసాగుతున్న అమ్మవారి భక్తి, బంధం ఈ జాతరలో మరోసారి సజీవంగా కనిపించింది. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా సాగిన ఈ వేడుకలో ప్రతి అడుగులోనూ ఆధ్యాత్మికత, ప్రతి మొక్కులోనూ ఓ నమ్మకం కనిపించింది. శ్రీశ్రీశ్రీ బంగారు పోచమ్మ తల్లి బోనాల జాతర నిర్వాహకులు, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం ఘనంగా జరిగింది. నిర్వాహక సభ్యులు కలవేని మల్లేశం, మడక లింగమూర్తి, కోరబోయిన సాంబయ్య, చెలికాని అవినాష్, డి.శ్రీలత, కనకలక్ష్మి, కె.శాంత, భాగ్యలక్ష్మి, స్వరూప, ఎస్.కోటి, అజయ్, సాగర్, ఉదయ్ తదితరులు పాల్గొని జాతర విజయవంతానికి సహకరించారు.

## పోతుగల్‌లో ఆకట్టుకున్న బుజ్జి గణపతి ఊరేగింపు

**ముస్తాబాద్, సెప్టెంబర్ 6:( విజన్ ఆంధ్ర)**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో నిన్నటి రోజు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బుజ్జి గణపతి విగ్రహం గ్రామ ప్రజలను, యువతను విశేషంగా ఆకట్టుకుంది. గణపతి ఊరేగింపులో యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సాల్వేర్ అనదీప్ ఆధ్వర్యంలో దాని నగేష్, నవీన్, సతీష్, ప్రవీణ్, సాయికృష్ణ, వెంకటేష్, రాజు, నరేష్, బాబు, మధు, సునీల్, ప్రశాంత్‌తో పాటు యూత్ సభ్యులందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గణనాథుని ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. తమకు గత 12 సంవత్సరాలుగా గణపతి విగ్రహాన్ని అందిస్తున్న కాలేరు అనిల్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి సంవత్సరం గణపతి ఉత్సవాలను నిర్వహించేందుకు సహకరిస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు, యువత ప్రశంసలతో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు మరింత ఉత్సాహంగా ఉత్సవాలను నిర్వహించారు. యువత ఐక్యతతో, గ్రామ ప్రజల సహకారంతో గణపతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## ఈనాడు వ్యాసరచన పోటీలో అవునూరు విద్యార్థుల ప్రతిభ




**ముస్తాబాద్, సెప్టెంబర్ 6:( విజన్ ఆంధ్ర)**
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం అవునూరు గ్రామంలో నిర్వహించిన ఈనాడు వ్యాసరచన పోటీలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, రచనా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలను చక్కగా వ్యాసాల రూపంలో వ్యక్తీకరించారు. పోటీలో మొదటి బహుమతిని రొడ్డ ఉదయ, రెండో బహుమతిని జక్కుల శ్రావణి, మూడో బహుమతిని మాచ లాక్షిత సాధించారు. విజేతలను ఉపాధ్యాయులు, నిర్వాహకులు అభినందించారు. ఇలాంటి వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో పఠనాసక్తి, భాషా పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాంటి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.

## పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం..

**ఓదెల సెప్టెంబర్ 6,(విజన్ ఆంధ్ర)**
అఖిలభారత యాదవ మహాసభ మండల అధ్యక్షులు వేల్పుల ఐలయ్య యాదవ్,మాజీ అధ్యక్షులు కావటి రాజు యాదవ్,గోపరపల్లి సర్పంచ్ మద్దెవేని రవి యాదవ్ ల సమక్షంలో లొ ఆదివారం పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులు గా వేల్పుల కొమురయ్య యాదవ్, ఉపాధ్యక్షులు గా మారం రవి యాదవ్,వేల్పుల కుమార్ యాదవ్,కోశాధికారిగా ఆవుల ప్రశాంత్ యాదవ్,ప్రధాన కార్యదర్శి మారం రమేష్ యాదవ్,కార్యవర్గ సభ్యులు.వేల్పుల అశోక్,లక్ష్మయ్య, సంపత్, ఐలయ్య, రమేష్,మారం కుమార్,ఆవుల కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ అన్ని విధాలా సంఘం బలోపేతనికి కృషి చేస్తామని తెలిపారు.



# రసమయి అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్



(మొదటి పేజీ తరువాయి..)

పునరుద్ధరించారు. ధర్నానంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యువ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనకం అశోక్, ఎస్టీ సెల్ నాయకుడు రేవెల్లి రాజలింగం మాట్లాడుతూ రసమయి బాలకిషన్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పై రాజకీయ విమర్శలు చేయకుండా ఆయనపైన,ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఎమ్మెల్యే స్వగ్రామం పచ్చునూరులో అక్రమంగా 20 ఎకరాల భూమి సంపాదించి వాటిలో ఫామ్ హౌస్ కడుతున్నారని రసమయి చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని వారు పేర్కొన్నారు. రసమయి బాలకిషన్ రాజకీయాల్లోకి రాకముందే 2006లో 14 ఎకరాల భూమి కలిగి ఉన్నారని వారు చెప్పారు. గ్రామంలో ప్రభుత్వ భూములు గాని ఇతరుల భూములను గాని ఇంచు మాత్రం కూడా ఆయన కబ్జాకు పాల్పడలేదని వారు స్పష్టం చేశారు. పచ్చునూరు భూములపై చేసిన ఆరోపణలు నిరూపించగలిగితే ఆ భూములను రసమయికి ధారాదత్తం చేస్తామని వారు స్పష్టం చేశారు. వాస్తవానికి అక్కడ ఎమ్మెల్యే సొంత ఖర్చుతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పడుకుంటే ఫార్మ్ హౌస్ గా చిత్రీకరించి దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. అలాగే 350 కోట్లతో మెడికల్ కాలేజీ నడుపుతున్నాడని చేసిన ఆరోపణలు కూడా పూర్తిగా అవాస్తవమని వారు పేర్కొన్నారు. నిరూపిస్తే రసమయికి ఆ మెడికల్ కాలేజీని అతని పేరిట రాసిస్తానని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన ప్రకటనను వారు ఈ సందర్భంగా ఉటం కించారు. అధికారం కోల్పోయాక రసమయి పిచ్చోడిగా మారి అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని వారు విమర్శించారు. ఇకముందు ఎమ్మెల్యే కుటుంబం జోలికి వస్తే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. చెరువుల్లోకి కొత్తనీరు వచ్చినపుడు గోండ్రి కప్పలు అరుస్తున్న మాదిరిగా రసమయి పిచ్చి పిచ్చిగా అరుస్తున్నారని వారు ఎద్దేవా చేశారు. గోచి గొంగడి వేసుకుని అడుక్కున్న చరిత్రను మరిచిపోయి రసమయి బాలకిషన్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లిని అడుకుంటున్నారంటూ ఆరోపణ చేయడాన్ని వారు తప్పుపట్టారు. ఆరోపణలు చేసేముందు వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికైనా రసమయి తన తీరు మార్చుకోవాలని లేకుంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, ప్యాక్స్ రెంటాల లక్ష్మారెడ్డి, చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, బుర్ర శ్రీధర్, మ్యాడ తిరుపతి రెడ్డి, రామడుగు హరీష్, ఎన్ బాపురావు,గొల్లెన కొమురయ్య, గుడాల మహేందర్ , బందెల మహేందర్,కనకం కుమార్, కె శ్రీనివాస్, కోండ్ర సురేష్ ,సంపత్, చంద్రాకర్, మొగిలి,అంజిరెడ్డి,సాయిరి దేవయ్య, తమిశెట్టి రాజేష్,దూలం వీరస్వామి, అంకూస్,వరహాలచారి,ఓదెలు పాల్గొన్నారు.

# రూ.3 వేల కోట్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## -ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు బీఆర్ఎస్ నేతల సవాల్

## -మహిళా ప్రజాప్రతినిధిని దూషించడం సరికాదు.. సంస్కారం లేని మాటలు మానుకోవాలి



**యాదగిరిగుట్ట,సెప్టెంబర్6(విజన్ఆంధ్ర)**

ఆలేరునియోజకవర్గ అభివృద్ధికి రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.. ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని బహుపేట సర్పంచ్ కవిడే మహేందర్,చోల్లేరు మాజీ సర్పంచ్ తోటకూర బీరయ్య,పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.3 వేల కోట్ల అభివృద్ధిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు మహిళా ప్రజాప్రతినిధిపై అసభ్యకర పదజాలంతో మాట్లాడటం తీవ్రంగా అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఇలాంటి సంస్కారం లేని వ్యాఖ్యలు మానుకుని దమ్ముంటే ప్రజల సమక్షంలో అభివృద్ధిపై చర్చకు రావాలని సూచించారు. మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులకు ఇప్పుడు శంకుస్థాపనలు చేసి అవన్నీ తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నియోజకవర్గానికి వాస్తవంగా వచ్చిన నిధులు ఎన్ని? వాటితో చేపట్టిన పనులేంటి? ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం ఎంత? అనే వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో కరెంట్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, రైతుబంధు పథకాన్ని అటకెక్కించారని ఆరోపించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, చీర శ్రీశైలం, ఇంజ నరేష్ తదితరులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. బహుపేటలో ప్రజల మద్దతు కోల్పోయిన వారు నామినేటెడ్ పదవులు పొందిన తర్వాత నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. దమ్ముంటే ఎన్నికలు పెట్టి గెలవాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ అంటే తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ పార్టీ అని వారు పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తయారు చేసిన సైనికులు పార్టీకి అండగా ఉన్నారని అన్నారు. తమ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజాక్షేత్రంలో తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. కురుమ, గొల్ల సామాజిక వర్గాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వారికి పెండింగ్లో ఉన్న పింఛన్లు వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. కురుమ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేగా బీర్ల అయిలయ్య ఆ వర్గాల సంక్షేమానికి ఇప్పటివరకు ఏం చేశారో వెల్లడించాలని కోరారు. రైతులు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడం మానుకోవాలని, అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

# జోగిపేటలో ఘనంగా జర్నలిస్ట్ డే

**జోగిపేట విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 06**



జర్నలిస్ట్ డే పురస్కరించుకొనిజోగిపేట ఎస్సీ బాలికల వసతి గృహ బాలికలకుజర్నలిస్ట్ డే సందర్భంగా పరీక్షల ప్యాడ్ లను తెలంగాణ యూనియాన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అందోల్ ప్రెస్ క్లబ్ అద్వర్యంలో అదివారం పంపిణీ చేశారు. పదవ తరగతి చదువుతున్న 30 మంది బాలికలకు ఎగ్జామ్ ప్యాడ్స్ వసతి గృహంలోని బాలికలందరికీ పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని సీనియర్ పాత్రికేయులు ఆనంద్ వర్ధన్,రాజశేఖర్ కులకర్ణి, వెంకట్ రెడ్డి,అల్లె మహేష్, మునిపల్లి యాదగిరిలు మాట్లడుతూ నేటి విద్యార్థనీలే దేశ భవిష్యత్తుకు రేపటి పౌరులన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు,వసతి గృహానికి,పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావలని తెలిపారు. జర్నలిస్టుడే సందర్భంగా జోగిపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు సురోత్తమ్ రెడ్డి,సార శివకుమార్, సహకారంతో బాలికలకు ఎగ్జామ్ ప్యాడ్స్,పెన్నులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అరే సత్యం,ఉలువల రాజు, బోడ సుమన్,శివరత్నం తదితరులు ఉన్నారు.

**జర్నలిస్టులకు సన్మానం**

ఆందోల్ మండలం సీనియార్ జర్నలిస్టులకు జోగిపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు సురోత్తం రెడ్డి, సార శివకుమార్ లు జర్నలిస్ట్ డేను పురస్కరించుకొని జర్నలిస్టులను శాలువాలతో సన్మానం చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ,జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రభుత్వానికి ప్రజలకు మధ్యలో వారధిగా ఉంటూ రాత్రింబవళ్లు సేవ చేస్తున్నారని ఈ సందర్భంగా వారు కొనియాడారు.



# సాధువెల్లి లో ఘనంగా బోనాల పండుగ

**యాదగిరిగుట్ట,సెప్టెంబర్6(విజన్ఆంధ్ర)**

మండలంలోని సాధువెల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుంకె ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పండుగను పురస్కరించుకుని సర్పంచ్ ప్రత్యేక చొరవతో పోచమ్మ ఆలయం వద్ద, బోనాలు వెళ్లే మార్గంలో రహదారి వెంట ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అందంగా అలంకరించుకున్నారు. డప్పు చప్పుళ్లు, భక్తుల కోలాహలం మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ అమ్మవారికి సమర్పించారు. అనంతరం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.



# పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ వెంక రెడ్డి

## -యాదగిరిగుట్టలో ఎస్ఐఆర్- 2026 పై క్షేత్రస్థాయి తనిఖీ




**యాదగిరిగుట్ట,సెప్టెంబర్6(విజన్ఆంధ్ర)**

ఎస్ఐఆర్--2026లో భాగంగా చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వెంకా రెడ్డి ఆదివారం పరిశీలించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 148ను సందర్శించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు.పోలింగ్ కేంద్రంలో ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఓటరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. పేరు చేర్పులు, తొలగింపులు, మార్పులు, సవరణలు అవసరమైతే నిబంధనల ప్రకారం ఫారం--6, ఫారం--7, ఫారం--8 ద్వారా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించుకోవచ్చని తెలిపారు. తెలంగాణలో ఎస్ఐఆర్--2026కు సంబంధించిన ముసాయిదా జాబితా, క్లెయిమ్‌లు--అభ్యంతరాల వివరాలను ఎన్నికల శాఖ అధికారికంగా అందుబాటులో ఉంచింది.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనర్హమైన లేదా తప్పులున్న నమోదులను నిబంధనల మేరకు సరిచేయడంతో పాటు ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్,తహసీల్దార్ గణేష్ నాయక్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.